

దుర్గమ్మ సేవలో ట్రాన్స్‌కో ఎండీ

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను ఏపీ ట్రాన్స్‌కో ఎండీ చక్రధర్‌బాబు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.



ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లను శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఫలితంగా క్యూలైన్లు కిటకిటలాడాయి.



హైవే బస్టాండ్‌కు శంకుస్థాపన

జగ్గయ్యపేట అర్బన్: హైవే వద్ద ఏపీఐఐసీ స్థలంలో హైవే బస్టాండ్ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి లా సెట్‌లో స్టేట్ 9వ ర్యాంకు



చీరాల అర్బన్: బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంకు చెందిన కాటూరి కోదండపాణి హైదరాబాద్‌లో విప్రోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ లాసెట్ రాశాడు. శుక్రవారం విడుదలైన లాసెట్ ఫలితాల్లో 91 మార్కులతో స్టేట్ 9వ ర్యాంకు సాధించాడు. ఎక్కడా కోచింగ్ తీసుకోకుండా సొంతంగా చదివి పరీక్ష రాసి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం విశేషం.

రేపు జూనియర్ బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న ఉదయం 8 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో జూనియర్ బాలుర బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి యరగాని శ్రీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2005 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన జట్టును ఈనెల 23 నుంచి 25 వరకు గుంటూరులోనే నిర్వహించే అంతర్ జిల్లాల పోటీల్లో ఆడిస్తామని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌కార్డుతోపాటు, రెండు ఫొటోలు తీసుకు రావాలని పేర్కొన్నారు.

41,270 బస్తాల మిర్చి విక్రయం




కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 38,361 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 41,270 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,700 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.10,000 నుంచి 23,800 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి రూ. 24,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,571 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు

19 నుంచి వైద్యసిబ్బంది బదిలీలు


గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ఈనెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు సాధారణ బదిలీలు జరుగుతాయని ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 19 కేడర్లకు చెందిన వైద్య సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు 579 మంది సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.20 అడుగుల వద్ద ఉంది. ఇది 149.6410 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. మొత్తం ఔట్ ఫ్లో 450 క్యూసెక్కులు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 450 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.10 అడుగుల వద్ద ఉంది. ఇది 33.8136 టీఎంసీలకు సమానం.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,800, గరిష్ట ధర రూ.3,700, మోడల్ ధర రూ.2,700 వరకు పలికింది.

సేద్యం ప్రవర్ధమానం

- దరఖాస్తు చేసిన వెంటనే సర్వీసులు మంజూరు
- జిల్లాలో కొత్తగా 30 వేల కనెక్షన్లు జారీ
- వేల సంఖ్యలో స్తంభాలు, 7,204 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు
- ఉచిత సర్వీసుల కోసం రూ.53.14 కోట్ల ఖర్చు
- సాగులోకి వందల ఎకరాల బీడు భూములు



ఉచిత విద్యుత్ సర్వీసు ద్వారా సాగవుతున్న పొలాలు

బాపట్లటౌన్: కర్షకులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు అన్ని విధాలా తోడ్పాటును అందిస్తోంది. పగటి పూటే ఉచితంగా తొమ్మిది గంటల విద్యుత్ అందిస్తోంది. నీటివసతి ఉండి దరఖాస్తు చేసుకున్న రైతులకు ఎవరి సిఫార్సు లేకుండా వేగంగా ఉచిత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు 30వేలకుపైగా ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతో సేద్యం ప్రవర్ధమానమవుతోంది. దీనికోసం రూ.53.14 కోట్లు ఖర్చుచేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులనూ పరిశీలించి రైతుల అవసరాలకు అనుగుణంగా సర్వీసులు మంజూరు చేయాలని సర్కారు ఆదేశాలు జారీ చేయడంతో విద్యుత్ సౌకర్యం లేక ఏళ్ళ తరబడి బీడులుగా మారిన భూములూ సాగులోకి వచ్చాయి. ఫలితంగా మారుమూల ప్రాంతాల్లోనూ అధికారులు స్తంభాలు ఏర్పాటు చేశారు. 3 ఫేజ్ విద్యుత్ మోటార్లకు తొమ్మిది గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన కరెంట్ అందిస్తున్నారు. ఓల్టేజ్ సమస్యలు రాకుండా ట్రాన్స్‌ఫార్మర్లనూ అమరుస్తున్నారు. ఇప్పటివరకు 7,204 ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చారు. దీంతో జిల్లాలో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది.

గతంలో అన్నీ ఇబ్బందులే..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత విద్యుత్ కనెక్షన్లు సకాలంలో మంజూరయ్యేవి కావు. సవాలక్ష షరతులు ఉండేవి. విద్యుత్ వాడకం, బిల్లుల విషయంలోనూ నిబంధనలు ప్రతిబంధకాలుగా మారేవి. దీంతో రైతులు నానా అవస్థలు పడేవారు.

జిల్లాలో వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఇలా..

నియోజకవర్గం పేరు	సర్వీసుల సంఖ్య
బాపట్ల	656
అద్దంకి	19,465
చీరాల	902
పర్చూరు	4,190
వేమూరు	11,509
రేపల్లె	1,554
మొత్తం	38,276

కొందరైతే వ్యవసాయం మానేసి రైతు కూలీలుగా జీవనం సాగించేందుకు సిద్ధమయ్యారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేనాటికి అద్దంకి, పర్చూరు, చీరాల, బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో సుమారు 8 వేలకుపైగా కొత్త కనెక్షన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ పరిశీలించి సర్వీసులు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో ఉన్న నిబంధనలనూ ప్రభుత్వం రైతులకు ఇబ్బంది లేకుండా మార్చింది. దీనివల్ల నెలనెలా బిల్లుల సమస్య, యూనిట్ల వాడకంపై పరిమితి లేకుండా పోయాయి. ఫలితంగా కర్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హాయిగా సేద్యం చేస్తున్నారు.

సేద్యం కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ →



అర్హత కలిగిన ప్రతి రైతుకు సర్వీసు మంజూరు



రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అర్హులందరికీ రూపాయి ఖర్చులేకుండా ఉచిత సర్వీసును మంజూరు చేస్తున్నాం. రైతుల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో 7,204 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశాం. ఇప్పటికే జిల్లాలో 38,276 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి.

– జి.ఆంజనేయులు, విద్యుత్‌శాఖ ఎస్ఈ బాపట్ల జిల్లా

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం స్థానిక స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మేనెలలో జరిగిన ప్రమాదాల్లో 30 మంది మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. జిల్లాలో బ్లాక్ స్పాట్స్ గుర్తించినా ఆ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద యుద్ధప్రాతిపదికన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో జనవరి నుంచి మే నెల వరకు 242 కేసులు నమోదు చేస్తే, రూ.8.27 లక్షల జరిమానాలు విధించారని వివరించారు. 15ఏళ్ల కాల పరిమితి ముగిసిన ప్రభుత్వ వాహనాలను రహదారులపైకి అనుమతించరాదని కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలలో క్షతగాత్రులకు తక్షణమే వైద్యం అందించడానికి బాపట్ల జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. జాతీయ రహదారులపైనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. అద్దంకి రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయని, రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టాలని సూచించారు. చిన్నగంజాం నుంచి రేపల్లె వరకు నిర్మాణంలో ఉన్న 216 జాతీయ రహదారి పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. 97 కిలోమీటర్ల పొడవున జిల్లాలో నిర్మిస్తున్న రహదారిపై హెచ్చరిక బోర్డులు, స్టాపర్లు ఏర్పాటుచేయలన్నారు. వాహనాల డ్రైవర్ల కోసం విశ్రాంతి స్థలాన్ని కేటాయించాలన్నారు. ఇందుకోసం భూసేకరణ ప్రక్రియ వేగంగా చేపట్టాలన్నారు. చిన్నగంజాం బ్రిడ్జి వద్ద రహదారి కుంగడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని అధికారులు కలెక్టరు దృష్టికి తెచ్చారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఎన్‌హెచ్ఏ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ టి.మహేష్ బాబు, ఆర్టీఓ చంద్రశేఖర్‌రెడ్డి, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై సమీక్ష

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జగనన్న సురక్షపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం చేయడంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈనెల 23 నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించాలని వివరించారు. ఈ కార్యక్రమంపై 19వ తేదీన గ్రామ సచివాలయాల ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో జేసీ సిహెచ్ శ్రీధర్, డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

వ్యవసాయ చట్టాలపై అవగాహన అవసరం

రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయ జేడీఏ కృపాదాస్

కొరిటెపాడు(గుంటూరు): విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన చట్టాలపై వ్యవసాయశాఖ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయం జేడీఏ వి.డి.వి.కృపాదాస్ సూచించారు. గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ చట్టాలపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వ్యవసాయాధికారులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందించడంలో వ్యవసాయ చట్టాల ప్రాముఖ్యత, వాటి అమలును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. జేడీఏ కృపాదాస్ మాట్లాడుతూ నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులే లక్ష్యంగా వ్యవసాయ చట్టాలు తయారు చేసినట్టు వివరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేసే ప్రైవేటు కంపెనీలు, డీలర్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లైసెన్సు లేకుండా అనధికారికంగా విక్రయించేవారిపై కఠిన చర్యలకు సిద్ధం కావాలన్నారు. కమిషనరేట్ కార్యాలయం ఏడీఏలు సుదర్శన్ రాజు, ఎస్.వెంకటేశ్వర్లు విత్తన చట్టాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎరువులు, పురుగుమందుల చట్టాలపై కమిషనరేట్ కార్యాలయం ఏడీఏ ఎ.మద్దులేటి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వ్యవసాయ అధికారులు నున్న వెంకటేశ్వర్లు, అబ్దుల్ సత్తార్, ఐ.మురళి, కమిషనరేట్ కార్యాలయం డీడీఏ జి.సుజాత, మూడు జిల్లాల ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీఏ కృపాదాస్, నున్న వెంకటేశ్వర్లు, ఐ.మురళి తదితరులు

జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు
- సీనియర్ పాత్రికేయులకు సన్మానం, ముఖాముఖి

నరసరావుపేట: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తన స్థాయిలో కృషిచేస్తున్నానన్నారు. 104 ద్వారా అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సంప్రదింపులు చేస్తున్నామన్నారు. ప్రతినెలా ఒక మెడికల్ క్యాంపు నిర్వహించాలని ప్రతిపాదించామన్నారు. జర్నలిస్టులు కేవలం వార్తలే కాకుండా పుస్తక రచనలు కూడా చేయాలని, వారు రచించిన పుస్తకాలను గ్రంథాలయాల్లో ప్రాధాన్య క్రమంలో కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమాభివృద్ధిని నిజాయితీగా విశ్లేషణ చేయాలన్నారు. పాత్రికేయులు, మీడియా సంస్థలకు అజెండాలు ఉండటం సహజమేనని, కానీ వ్యక్తిగత అజెండాలతో రాసే కథనాలు రాష్ట్ర పురోగతిని అడ్డుకునేలా ఉండకూడదన్నారు. అకాడమీ చైర్మన్‌గా నాలుగు నెలల వ్యవధిలో 40కుపైగా క్షేత్రస్థాయి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సన్మానం పొందిన కేవీకే రామారావుతో తనకు 45ఏళ్ల అనుబంధం ఉందన్నారు. తానీ స్థాయికి ఎదగడంలో రామారావు పాత్ర కూడా ఉందన్నారు. మడకా సత్యనారాయణ, రామారావు నేటితరం పాత్రికేయులకు ఆదర్శమన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ పత్రికా పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. మరో ముఖ్యఅతిథి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొమ్మినేని పాత్రికేయ రంగంలో హీరోలాంటి వారని కొనియాడారు. విపత్కర పరిస్థితుల్లో జర్నలిస్టుల పనితీరు మెచ్చుకోదగిందన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ నిష్పక్షపాతంగా ఉండే జర్నలిస్టు కొమ్మినేని అని చెప్పారు. జర్నలిస్టులలో ఆయనది ప్రత్యేక శైలి అన్నారు. తన నియోజకవర్గంలో ప్రతి జర్నలిస్టుకూ రెండు సెంట్ల స్థలంలో 100పైగా ఇళ్లతో కాలనీ నిర్మించేందుకు కృషి చేస్తున్నానన్నారు. అనంతరం నరసరావుపేటకు చెందిన ప్రముఖ పాత్రికేయులు కె.వి.కె రామారావు, జర్నలిస్టు, మాజీ అధ్యాపకులు మడకా సత్యనారాయణను సన్మానించారు. పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్, నరసరావుపేట తరఫున పాత్రికేయులు సమస్యలపై కొమ్మినేనికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయనను సన్మానించారు. పొడా చైర్‌పర్సన్ మిట్టపల్లి రమేష్, మీడియా అకాడమీ సెక్రటరీ బాలగంగాధర్ తిలక్, నరసరావుపేట, రొంపిచెర్ల జెడ్పీటీసీ సభ్యులు పి.ఓబుల్‌రెడ్డి, పదముత్తం చిట్టిబాబు, పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు బి.ప్రసాదరావు, సీహెచ్.వి.రమణారెడ్డి, పి.నాగరాజు, జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దసంఖ్యలో పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ పాత్రికేయులను సన్మానిస్తున్న కొమ్మినేని, కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, బొల్లా,

ఉలిక్కిపడిన ఉప్పాలవారిపాలెం

- అమర్‌నాథ్ హత్యతో విషాదఛాయలు
- తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

చెరుకుపల్లి: మండలంలోని రాజవోలు గ్రామ పరిధిలోని ఉప్పాలవారిపాలెం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్‌నాథ్(15) హత్యతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. గ్రామస్తులంతా అమానుష చర్యను ఖండిస్తున్నారు.

సోదరిని టీజింగ్ చేయడంతో మొదలైన గొడవ

అమర్‌నాథ్ సోదరిని గ్రామానికే చెందిన పాము వెంకటేశ్వరరెడ్డి(వెంకి) గతంలో టీజింగ్ చేయడంతో గొడవ మొదలైంది. దీనిపై అమర్‌నాథ్ వెంకటేశ్వరరెడ్డిని నిలదీశాడు. ఆ తర్వాత పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. పాఠశాలల పునఃప్రారంభమైన తర్వాత అమర్‌నాథ్ బడికి వెళ్లి వచ్చే క్రమంలో అడ్డగించి వెంకటేశ్వరరెడ్డి గొడవ పడుతున్నాడు. ఈ విషయమై అమర్‌నాథ్ తాత ఉప్పాల రెడ్డియ్య, నానమ్మ ధనలక్ష్మి, తల్లి మాధవి వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులకు చెప్పారు. కొడుకును అదుపులో పెట్టుకోవాలని సూచించారు. దీంతో మరింత కక్ష పెంచుకున్న వెంకటేశ్వరరెడ్డి మరో ముగ్గురితో కలిసి శుక్రవారం ట్యూషన్‌కు వెళ్తున్న అమర్‌నాథ్‌ను అడ్డగించి దాడి చేసి పెట్రోల్ పోసి నిప్పటించి పరారయ్యాడు. స్థానికులు గమనించి మంటలు ఆర్పి అమర్‌నాథ్‌ను గుంటూరు ప్రభుత్వాస్పత్రి తరలించగా, అక్కడ మరణించాడు.

గుండెలవిసేలా రోదిస్తున్న నానమ్మ, సోదరి

అమర్‌నాథ్ మృతితో అతడి నానమ్మ గుండెలవిసేలా రోదిస్తోంది. 13 ఏళ్ల క్రితం కొడుకు చనిపోయాడని, కోడలు, చిన్నపిల్లలను తమ వద్దే ఉంచుకుని వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని విలపించింది. మాపై ఎందుకంత పగబట్టావు దేవుడా అంటూ కన్నీరుమున్నీరవుతోంది. వృద్ధురాలి వేదన స్థానికులను కంటతడి పెట్టించింది. తమ్ముడిని హత్య చేశారని తెలిసిన అమర్‌నాథ్ సోదరి కూడా తీవ్రంగా విలపించి సొమ్మసిల్లి పడిపోయింది. అమర్‌నాథ్ ఇంటి వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. అతడి తల్లి మాధవి, తాత ఉప్పాల రెడ్డియ్య గుంటూరు ఆస్పత్రికి వెళ్లారు.

గ్రామంలో పోలీసు బందోబస్తు

అమర్‌నాథ్ హత్యతో గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ వకుల్‌జిందాల్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ మహేష్ పరిశీలించారు. సీఐలు రాజమోహన్, శివశంకర్ పర్యవేక్షణలో ఎస్ఐలు కొండారెడ్డి, రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ మహేష్ చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పరిస్థితిపై సమీక్షిస్తున్నారు.



మృతుడు అమర్‌నాథ్ ఇంటి వద్ద విలపిస్తున్న బంధువులు

గుంటూరు స్టేషన్‌ను సందర్శించిన రైల్వే ఐజీ

లక్ష్మీపురం(గుంటూరు): సెక్యూరిటీ మోడరన్ గార్డ్ గైడ్స్ వాహనాన్ని దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తిరుపతి, సికింద్రాబాద్ తరువాత గుంటూరు రైల్వే డివిజన్‌లోనే ఆవిష్కరించినట్టు సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారామ్ చెప్పారు. గుంటూరు రైల్వే స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. డివిజన్ రైల్వే ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం సెక్యూరిటీ మోడరన్ గార్డ్ గైడ్స్ వాహనాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌లో భద్రత అంశాలు బాగున్నాయని వివరించారు. ప్లాట్‌ఫాంల తనిఖీకి గార్డ్ గైడ్స్ వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఆర్పీఎఫ్ పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రైల్వే స్టేషన్‌లోని ఆర్పీఎఫ్ స్టేషన్‌ను, సిబ్బంది బ్యారెట్స్‌ను, డాగ్ స్క్వాడ్ భవనాన్ని పరిశీలించి, డాగ్ స్క్వాడ్ భవనంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ హరిప్రసాద్, రైల్వే ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారామ్

పది గ్రాముల డ్రగ్ స్వాధీనం

ఒక యువకుడు, బాలుడు అరెస్ట్

తాడేపల్లిరూరల్ : నరాలను ఉత్తేజపరిచే డ్రగ్ మెథాంఫేటమిన్‌ను తాడేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకుని ఒక యువకుడిని, ఒక బాలుడిని అదుపులోకి తీసుకుని శుక్రవారం కోర్టుకు హాజరుపరిచారు. తాడేపల్లి సీఐ శేషగిరి కథనం ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం త్రినాథపురానికి చెందిన యాగంటి శ్రీచందు పంజాబ్‌లోని ఓ యూనివర్శిటీలో చదువుకుంటున్న సమయంలో నిషేధిత డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. గుజరాత్‌లోనూ ఇతనిపై గంజాయి కేసు నమోదైంది. అక్కడి నుంచి స్వగ్రామం వచ్చిన శ్రీచందు తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓ సాఫ్ట్‌వేర్ కోచింగ్ సెంటర్‌లో ట్రెనింగ్ తీసుకుంటున్నాడు. ఇదే క్రమంలో వడ్డేశ్వరం చుట్టుపక్కల గంజాయి తాగేవారిని పరిచయం చేసుకుని తన వద్ద మెథాంఫేటమిన్ ఉందని, దానిని విక్రయిస్తానని చెప్పాడు. వడ్డేశ్వరంలో చదువు మానేసి ఖాళీగా ఉన్న ఓ బాలుడిని పరిచయం చేసుకుని అతడికి డ్రగ్‌ను అమ్ముతానని చెప్పాడు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, డీఎస్పీ రాంబాబు ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి విక్రేతలపై నిఘా పెట్టిన తాడేపల్లి ఎస్ఐ రమేష్, సిబ్బంది శుక్రవారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు కొలనుకొండలోని సర్వీస్ రోడ్ వద్ద శ్రీచందు, బాలుడికి డ్రగ్‌ను అందజేస్తుండగా దాడి చేశారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న 10 గ్రాముల మెథాంఫేటమిన్ స్ఫటికలు స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. శ్రీచందు ఈ డ్రగ్‌ను తెప్పించడం ఇదే మొదటిసారని, ఢిల్లీ నుంచి దీనిని కొయ్యలగూడెంకు తెప్పించి అక్కడి నుంచి ఇక్కడకు తీసుకొచ్చినట్టు సీఐ తెలిపారు.

మహిళల రక్షణే దిశ యాప్ ధ్యేయం

- రాష్ట్రంలోనే రికార్డుస్థాయిలో దిశ యాప్ రిజిస్ట్రేషన్
- జిల్లాలో ఇప్పటివరకు 3,61,902 రిజిస్ట్రేషన్లు
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్ల టౌన్: మహిళల రక్షణే దిశ యాప్ ధ్యేయమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించిన దిశయాప్ మెగా డ్రైవ్‌పై శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ రెండురోజుల్లో రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో జిల్లా పోలీసులు 25,926 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,61,902 రిజిస్ట్రేషన్లు చేయటం జరిగిందన్నారు. ఎక్కువ సంఖ్యలో దిశ యాప్‌లు రిజిస్ట్రేషన్ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, వార్డు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. దిశ యాప్ కేవలం మహిళలకు మాత్రమే కాదు, ప్రతి ఒక్కరికి ఉపయోగపడే సమాచార వ్యవస్థ దిశ యాప్ లో ఉందన్నారు.

ఇంకొల్లు బస్టాండు అభివృద్ధికి చర్యలు

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదం సాహెబ్



ఇంకొల్లు(చినగంజాం): గ్రామంలో ఆర్టీసీ బస్టాండు అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోనున్నట్లు నెల్లూరు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొచ్చర్ల ఆదం సాహెబ్ అన్నారు. ఇంకొల్లు బస్టాండును ఆయన శుక్రవారం పరిశీలించారు. బస్టాండ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చీరాల డిపో మేనేజర్ శ్యామలను ఆదేశించారు. అదే విధంగా ఆర్టీసీ కార్గో ఆదాయం పెరిగే విధంగా సర్వీసులను ఏర్పాటు చేయాలని ఇంకొల్లు నుంచి గుంటూరు–విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు సర్వీసుల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కోరారు. గుంటూరు, విజయవాడకు త్వరితగతిన బస్సులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంకొల్లు బస్టాండులో మరుగుదొడ్లను అత్యవసరంగా పూర్తిస్థాయిలో రీ మోడలింగ్ చేయాలని ఆదేశించారు. నెల రోజులలో అభివృద్ధితో పాటు బస్టాండు రంగులు, సర్వీసులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఔత్సాహిక వ్యాపార వేత్తలకు బస్టాండ్‌లోని ఖాళీ స్థలాన్ని అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట చీరాల డిపో మేనేజర్ శ్యామల, అద్దంకి డీఎం మోహనరావు, ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ శాస్త్రి, కంట్రోలర్ బాబు పాల్గొన్నారు.

పేదింటి రత్నాలు. ..జగనన్న ఆణిముత్యాలు

ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ప్రోత్సాహకాలు



జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున (ఫైల్)

బాపట్ల అర్బన్: ప్రతిభకు పట్టాభిషేకం చేస్తున్నారు. ప్రతిభ గల విద్యార్థులను తీర్చిదిద్దిన తల్లిదండ్రులను ఆత్మీయంగా సత్కరిస్తున్నారు. ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఆణిముత్యాలు మరింత మెరుగు పరిచేందుకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తున్నారు. బాపట్ల జిల్లాలో శనివారం శ్రీకారం చుట్టారు.

ర్యాంకు కొట్టు.. ప్రోత్సాహం పట్టు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి బహుమతులు అందిజేస్తోంది. జగనన్న ఆణిముత్యాల పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆయా తరగతుల్లో టాప్‌లో నిలిచిన వారికి ప్రోత్సాహకాలు అందించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో నేటి నుంచి, జిల్లా స్థాయిలో ఈ నెల 17 నుంచి, రాష్ట్ర స్థాయిలో ఈ నెల 20న ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బహుమతులు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లోని గవర్నమెంట్ స్కూల్స్, జిల్లా పరిషత్ హై స్కూల్, మున్సిపల్ , కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్, ట్రైబల్ ఇలా ఎనిమిది కేటగిరీ స్కూళ్లకు సంబంధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు అందజేయనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వీటిని ప్రదానం చేయనున్నారు. ప్రథమ శ్రేణి వచ్చిన విద్యార్థికి రూ.50 వేలు, ద్వితీయ శ్రేణి వచ్చిన వారికి రూ.30 వేలు, తృతీయ శ్రేణి వచ్చిన వారికి రూ.15 వేలుతో పాటు మెడల్, సర్టిఫికెట్, నగదు పురస్కారాలు అందించనున్నారు. జిల్లాలో నియోజకవర్గ స్థాయిలో 24 మంది పదో తరగతి విద్యార్థులు పురస్కారం అందుకోనున్నారు. ఇంటర్మీడియెట్ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి స్థానాలు సాధించిన విద్యార్థులు 16 మంది ఉన్నారు. వీరు ప్రతిభా పురస్కారాలు అందుకోనున్నారు.

తల్లిదండ్రులకూ సత్కారం

ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను జగన్ సర్కారు ప్రోత్సహిస్తోంది. దీంతో పాటు ఆయా విద్యార్థుల తల్లిదండ్రులనూ సత్కరించనున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు స్టేజీ పైన ఉత్తమ పురస్కారం అందుకుంటుంటూ.. ఆనందంతో ఉప్పొంగే తల్లిదండ్రులు గుండె చప్పుడు వినాలన్నదే ప్రభుత్వ ఆశయమని, అందుకే తల్లిదండ్రులనూ సత్కరించి మరింత మంది విద్యార్థులకు ప్రోత్సాహంగా ఉంటామని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో భాగంగానే తల్లిదండ్రులను సత్కరిస్తున్నారు.

విద్యలో విప్లవాత్మక మార్పులు

జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం మంచి కార్యక్రమం. జగనన్న ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. విద్యార్థులకు పురస్కారాలు ఇవ్వడం వలన వారిలో ఇంకా చదవాలనే మంచి ధృడ సంకల్పం కలిగించారు.

–పి.వి.జె.రామారావు,
జిల్లా విద్యాశాఖ అధికారి బాపట్ల

రాజగోపురం నిర్మాణానికి రూ.18.75 లక్షలు

అద్దంకి రూరల్: దక్షిణకాశీగా పిలువబడే మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవస్థాన రాజగోపురం నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టీటీడీ దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, వైవీ భద్రారెడ్డి, శాప్ నెట్ చైర్మన్ కృష్ణ చైతన్య సహకారంతో రూ.18.75 లక్షలు, దాతలు మరో రూ.6 లక్షలు అందజేసినట్లు శుక్రవారం దేవాలయ చైర్మన్ ఈదా విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి ఈదా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కొలకలూరులో మంత్రి నాగార్జున పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి డాక్టర్ నాగార్జున

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున జన్మదినం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొలకలూరి వసంత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సెంటర్‌లో నిర్వహించారు. కనకతప్పెట్లు, బ్యాండ్ మేళాలతో మంత్రి నాగార్జునకు ఘనస్వాగతం పలికారు. టపాసులు కాల్చారు. సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి నాగార్జున కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొలకలూరి నాగేశ్వరరావు, పినపాటి అనిల్‌కుమార్, సత్యానందకుమార్, కోడూరు చింతాల్ బాబు, కేసరి, గాజులవర్తి జింబో, బీసీపోగు రవి, గోరికపూడి ఆంథోని, రావూరి బుల్లబ్బాయి, జోసఫ్, సందీప్, షేక్ బాజీ పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామిక రంగంలో ఎదగాలి

డీఆర్డీఏ పీడీ అర్జునరావు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

పర్చూరు(చినగంజాం): మహిళలు పారిశ్రామిక రంగంలో కూడా ముందుండాలని డీఆర్డీఏ పీడీ వంత అర్జునరావు పేర్కొన్నారు. శుక్రవారం డీఆర్డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మహిళలు జీవనోపాదులతో ఆర్థికంగా ఎదగాలి అనే లక్ష్యంతో నియోజకవర్గంలో వీఓఏలకు అవగాహన సదస్సు ఐపీడీపీఎం యూ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పీడీ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికంగా ఎదగాలన్నారు. పీఎం ఈజీపీ, పీఎం ఎఫ్ఎంఈ డెయిరీ యూనిట్‌లు, పౌల్ట్రీ యూనిట్‌లు తదితర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్ని రంగాల్లో రుణాలు పొంది కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. మండలానికి 90 యూనిట్‌లు టార్గెట్ ఇచ్చామని, ఇందులో డెయిరీ యూనిట్లు 10, పీఎంఈజీబీ కింద కారం మిల్లులు, పసుపు మిల్లులు, దినుసులను పప్పు చేసే మిల్లులు, గ్రైండర్‌లు, వేరుశనగ ముద్దలు తయారు చేయడం, నూజీడీలు తయారు చేయడం, అన్ని రకాల న్యూట్రిషన్ ఫుడ్స్ తయారు చేయడం వంటి పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి మహిళలు ముందుకు రావాలన్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మదన్‌మోహన్‌శెట్టి మాట్లాడుతూ మహిళా సంఘాలకు అన్ని విధాలుగా పూర్తి సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

ఉద్యోగావకాశాల కల్పనే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

నగరం: రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కల్పన సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను శుక్రవారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వచ్చిన తరువాత ఇప్పటి వరకు 6,16,323 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. నాలుగేళ్ల కాలంలో 2,06,638 మందికి పర్మినెంట్ ఉద్యోగాలు, 37,908 మందికి కాంట్రాక్టు, 3,71,777 మందికి అవుట్‌సోర్సింగ్, ఉద్యోగాలను కల్పించినట్లు పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో 2014నుంచి 2019 వరకు కేవలం 34,108 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించారని వివరించారు. దేశచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. అనంతరం ఎంపీ మోపిదేవిని కళాశాల పాలకవర్గ సభ్యులు, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 30 కంపెనీల ప్రతినిధులు సుమారు 1000 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్, ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, డాక్టర్ గోగినేని హనుమంతరావు పాల్గొన్నారు.

సంక్షేమం దిశగా ముస్లిం, మైనార్టీలు

జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి మస్తాన్‌వలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

మార్టూరు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి అన్నారు. స్థానిక గన్నవరం రోడ్డులో మసీదు వద్ద ముస్లిం పెద్దలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రాజకీయపార్టీలన్నీ ముస్లింలను ఓటు బ్యాంకుగానే పరిగణించాయని, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అన్ని రంగాల సంక్షేమ పథకాలతో పాటు రాజకీయ రంగంలో ముస్లింలను భాగస్వాములను చేయడమే కాకుండా షాదీఖానాలు, మసీదులు, శ్మశానాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ముస్లింలంతా ఎప్పటికీ జగన్ వెంటే పయనిస్తారన్నారు. ఈ సందర్భంగా 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్ కే సాత్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరిముల్లా, మాజీ ఎంపీటీసీ మునిపల్లి దరియా, మసీద్ మౌజన్ పఠాన్ కరిముల్లా, రసూల్, జలీల్, వలి, జాన్, ఆదం, రఫి పాల్గొన్నారు.

అర్హులకు అక్రిడిటేషన్‌లు మంజూరు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: అర్హులైన మీడియా ప్రతినిధులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా తెలిపారు. అక్రిడిటేషన్ జిల్లా స్థాయి కమిటీ తొలి సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని సూచించారు. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నుంచి 264 దరఖాస్తులు వచ్చాయన్నారు. ధ్రువీకరణపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించిన తదుపరి అర్హులను గుర్తించామన్నారు. జి.ఓ నంబరు 38 అనుసరించి జిల్లా కమిటీ పలు నిర్ణయాలు తీసుకుందని కలెక్టరు వివరించారు. తొలివిడతలో ప్రింట్ మీడియా నుంచి 125 మందికి, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి 82 మంది ప్రతినిధులకు అక్రిడిటేషన్లు జారీ చేస్తున్నట్లు కలెక్టరు ప్రకటించారు. బాపట్ల జిల్లాగా ఏర్పడిన నేపథ్యంలో జిల్లాలోని మీడియా ప్రతినిధులకు ఉమ్మడి జిల్లాలో ప్రయాణించేందుకు బస్సు పాస్ పరిమితులు ఉంటాయని తెలిపారు. అలాగే నిబంధనలు అనుసరించి చిన్న, మధ్యతరహా పత్రికలకు త్వరలో అక్రిడిటేషన్లు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. గతంలో మాదిరిగా రైల్వే పాస్‌లు మంజూరు చేయించాలని కమిటీలోని మీడియా ప్రతినిధులు కలెక్టరు దృష్టికి తెచ్చారు. సమావేశంలో సమాచార మరియు పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు కె.సుభాషిణి, కమిటీ సభ్యులు వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఎస్.విజయమ్మ, గృహనిర్మాణ శాఖ అధికారి ప్రసాద్, రైల్వేశాఖ బాపట్ల స్టేషన్ మేనేజర్ కె.మీనా, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఏడుకొండలరావు, ఆర్టీసీ డీఎం టి.శ్రీనివాసరావు, కార్మికశాఖ అధికారి రామకృష్ణ, డివిజనల్ పౌర సంబంధాల అధికారి టి.మోహన్ రాజు, పౌర సంబంధాల అధికారి కె.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

- డ్రైవర్ నిద్రమత్తుతో ప్రమాదం
- కోనంకి వద్ద ట్రాఫిక్ అంతరాయం



రహదారికి అడ్డంగా పడి ఉన్న లారీలు

మార్టూరు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొట్టుకోవడంతో ఇద్దరు డ్రైవర్‌లు, ఒక క్లీనర్ గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో కోనంకి ఫ్లైఓవర్ సమీపంలో చోటుచేసుకుంది. హైవే పెట్రోలింగ్ వాహనం ఇన్‌చార్జి నరసింహారావు, అంబులెన్స్ సిబ్బంది కోటేశ్వరరావు వివరాల మేరకు.. బెంగళూరు నుంచి కొల్‌కత్తాకు 800 టమోటా బాక్సులతో ఓ భారీ వాహనం వెళ్తోంది. కోనంకి ఫ్లైఓవర్ దిగే క్రమంలో డ్రైవర్ అశోక్ నిద్రమత్తు కారణంగా లారీ అదుపుతప్పి రహదారికి మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటుకొని బిహార్ నుంచి కోయంబత్తూరుకు మిషనరీ తరలించే మరో లారీని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు లారీలు మార్టూరు– ఒంగోలు రహదారికి అడ్డంగా పడిపోయాయి. ఈకారణంగా మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఏర్పడింది. ప్రమాద విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ వాహన సిబ్బంది, అంబులెన్స్ సిబ్బంది బలికురవ 108 సిబ్బంది తక్షణమే ప్రమాదస్థలికి చేరుకున్నారు. ప్రమాదంలో టమోటా లారీ డ్రైవర్ అశోక్‌కు ఎడమ కాలికి గాయమైంది. ఒంగోలు వైపు వెళ్తున్న రెండో లారీ డ్రైవర్ రాజేష్‌కుమార్, క్లీనర్ శశికుమార్‌కు గాయాలు కావడంతో ముగ్గురిని మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లక్షల రూపాయలు విలువైన టమోటా రోడ్డుపాలు కావడంతో స్థానికులు, వచ్చే పోయే ప్రయాణికులు దొరికిన వారు దొరికినట్లే తీసుకువెళ్లారు. హైవే సిబ్బంది క్రేన్‌ల సాయంతో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న రెండు వాహనాలను తీవ్రంగా శ్రమించి మధ్యాహ్నం లోపు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూశారు.

చేనేతలకు నారా లోకేష్ క్షమాపణలు చెప్పాలి

- చేనేతల దుస్థితికి చంద్రబాబు పాలనే కారణం
- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



చెరుకుపల్లిలోని సొసైటీలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

చెరుకుపల్లి: చేనేతలను దత్తత తీసుకుంటానని చెబుతున్న నారా లోకేష్, చేనేత వర్గానికి క్షమాపణలు చెప్పాలని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి డిమాండ్ చేశారు. మండలంలోని కనగాలలో చేనేత సహకార సంఘం కార్యాయాన్ని శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ చేనేతల దుస్థితికి చంద్రబాబు 14 సంవత్సరాల పాలనేనని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మరో మారు చేనేత వర్గాలను మభ్యపెట్టేందుకు నారా లోకేష్, చంద్రబాబు యాత్రల పేరుతో రావటం సిగ్గుచేటన్నారు. 2019లో చంద్రబాబు అండ్ కోకు ఏవిధంగా పరాభవం ఎదురైందో అదే మాదిరి 2024 ఎన్నికల్లో మారో మారు పరాభవం తప్పదని పేర్కొన్నారు.

చేనేతలకు పూర్వవైభవం..

చేనేతలకు పూర్వవైభం అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. చేనేతలకు నాలుగు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించటంతో పాటు రెండు ఎమ్మెల్సీలు, ఒక ఎంపీ స్థానాన్ని అందించి చేనేతలను రాజకీయంగా మరింత అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.24 వేలు అందించటంతో పాటు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని చెప్పారు. చేనేతల అభివృద్ధికి జగనన్న చేస్తున్న కృషి చేనేతల గుండెల్లో పదిలంగా ఉంటుందని వివరించారు. తొలుత మండలంలోని చెరుకుపల్లి, కనగాల గ్రామంలోని చేనేత సొసైటీలను సందర్శించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మృతి చెందిన 11 మందికి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.12,500 చొప్పున చెక్కులను అందించారు. అనంతరం కనగాలలోని ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు సొసైటీల సొసైటీ అధ్యక్షులు లక్ష్మీనర్సు, సంగాబత్తుని సూర్యనారాయణ, మత్రివాడ సత్యనారాయణ, దివి రాంబాబు, పట్టెం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సారె సంబరం.. ఇంద్ర వైభోగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఈ నెల 19వ తేదీ నుంచి సారె సంబరం ప్రారంభం కానుంది. సోమవారం నుంచి జూలై 17వ తేదీ వరకు జరిగే ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి సారె సమర్పిస్తారు. నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. నెల రోజులు నిర్వహించే ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా విజయవాడ నగరంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు, భక్త బృందాలు, ఆలయాలు, దేవస్థానాల నుంచి అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయతీగా వస్తోంది. ఆషాఢ మాసం తొలి రోజున ఆలయ స్థానాచార్య, వైదిక కమిటీ సభ్యులు అమ్మవారికి తొలి సారె సమర్పిస్తారు. ఉత్సవాల్లో చివరి రోజైన జూలై 17వ తేదీన దేవస్థానం తరఫున ఈఓ, ఆలయ అధికారులు, సిబ్బంది అమ్మవారికి సారె సమర్పిస్తారు. అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారికి సారె సమర్పించే భక్తులు ముందుగా దేవస్థాన టోల్ ఫ్రీ నంబర్(1800 425 9099)కు సమాచారం ఇవ్వాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ కోరారు.